ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 10 ఏప్రిల్ 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 25.0


రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:27 (బుధ)
గురువారం రంజాన్



ఆచంట మండలం కరుగోరుమిల్లి ర్యాంప్‌లో గ్రామస్థులు ట్రాక్టర్‌లు పట్టుకుని అధికారులకు అప్పగిస్తే.. సాయంత్రానికి అవి మాయమయ్యాయి..!

గోదావరిలో పుష్కలంగా ఇసుక ఉన్నా.. ఈ జిల్లాలో దొరకడం లేదు. టీడీపీ హయాంలో ఉచితంగా ఇచ్చిన ఇసుక ఇప్పుడు ట్రాక్టర్ ఐదు వేలు అయ్యింది. సీఎం జగన్‌రెడ్డి ఇసుకను దోచుకుంటూ భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేశాడు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఉచిత ఇసుకను అందజేస్తాం.

- పాలకొల్లు ప్రజాగళం సభలో చంద్రబాబు



ఉచిత ఇసుక
అందరికీ మేలు

అధికారంలోకి రాగానే అమలుకు చంద్రబాబు ప్రకటన

భవన నిర్మాణ కార్మికుల హర్షం

- ఇప్పటికే గోదావరిని గుల్ల చేసిన అధికార పార్టీ నేతలు
- జగన్ హయాంలో అధిక ధరలతో భారీగా దోపిడీ.. ఒడిదుడుకుల్లో నిర్మాణరంగం
- ఎన్నికల కోడ్ వచ్చినా ఆగని దందా.. భారీగా తవ్వకాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇసుక అక్రమ దందాకు తెరలేచింది. అనుమతులు లేని తవ్వకాలతో అధికార పార్టీ నేతలు గోదావరిని గుల్ల చేస్తున్నారు. ఇసుక ర్యాంప్‌ల వైపు అధికారులు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. ఫలితంగా ఈ ఐదేళ్లలో వైసీపీ నేతలు కోట్లు కొల్లగొట్టారు. టీడీపీ హయాంలో అమలు చేసిన ఉచిత ఇసుక విధానాన్ని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ధరలు భారీగా పెంచి ఏడాదిపాటు ఇసుకను సక్రమంగా సరఫరా చేయలేకపోయింది. ఫలితంగా ఎంత డబ్బులు ఇచ్చినా ఇసుక దొరికేది కాదు. ఎక్కడైనా ఒక ట్రాక్టర్ ఇసుక కనిపిస్తే రకరకాల కేసుల పేరుతో అధికారులు వేధించేవారు. ఈ క్రమంలో భవన నిర్మాణ రంగం స్తంభించింది. కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. నిర్మాణ అనుబంధ రంగాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఆ మరుసటి ఏడాది నుంచి కరోనా వెంటాడింది. పనులు లేక కార్మిక కుటుంబాలు అల్లాడిపోయాయి. రోజు గడవడమే గగనమైంది. ఎంతో నష్టం జరిగిన తర్వాత కాని ప్రభుత్వం కళ్లు తెరవలేదు. ఇసుక విక్రయాలను ప్రభుత్వం చేపట్టింది. అయితే ధరలు మాత్రం ఆకాశాన్ని తాకాయి. లారీ ఇసుక రూ.18 వేలకు పైగా పలికింది. జిల్లాలో స్టాక్ పాయింట్‌లు ఏర్పాటుచేశారు. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు అక్కడ అక్రమంగా విక్రయించి జేబులు నింపుకున్నారు. ప్రభుత్వం అభాసుపాలైంది. దీంతో ప్రైవేటు ఏజన్సీకి మళ్లీ కాంట్రాక్ట్ ఇచ్చారు. అయినా ఇసుక ధరలు తగ్గలేదు. చివరకు లారీ ఇసుక రూ.14 వేలకు చేరింది. గోదావరిలో అనుమతులకు మించి తవ్వకాలు సాగించారు. ఇప్పటికీ అదే ధరకు అమ్మకాలు సాగిస్తున్నారు.

గడువు ముగిసినా దందానే..

ప్రైవేటు ఏజన్సీ గడువు ముగిసినా అదే ఏజన్సీ పేరుతో తవ్వకాలు సాగించి, బిల్లులు మంజూరు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి, రాష్ట్ర నేతల వరకు ఇసుకను అడ్డంగా దోచుకున్నారు. ఇప్పటికే పాత ఏజన్సీల పేరుతోనే బిల్లులు మంజూరవుతున్నాయి. తవ్వకాలు అక్రమంగా సాగుతూనే ఉన్నాయి. తీర ప్రాంతంలో నిత్యం ఇసుక దందా సాగుతునే ఉంది. ప్రైవేటు ఏజన్సీకి తవ్వకాలు సాగించి అమ్మేందుకు కాంట్రాక్ట్ ఇచ్చారు. కానీ జిల్లాలో కొండలుగా నిల్వ చేసి అమ్మకాలు సాగించారు. అందుకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో బిల్డర్లు కాస్త నిల్వ చేసినా సరే విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించేవారు. బిల్లులను పరిశీలించేవారు. కొండలుగా గుట్టలు వేసినా సరే దళారులను ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉన్నారు.

వైసీపీ నేతల హవా

ప్రైవేటు ఏజెన్సీ పేరుతో ర్యాంపుల్లో పరిమితికి మించి తవ్వకాలు సాగించారు. పర్యావరణ అనుమతులు లేవంటూ కేంద్ర పర్యావరణ సంస్థ బ్రేక్‌లు వేయడంతో కొత్తగా ఏజన్సీని నిర్ధారించేందుకు కష్టతరమైంది. ఆ సమయంలోనూ ఇసుక తవ్వకాలు ఆగలేదు. పరిమితికి మించి తవ్వకాలు చేస్తున్నాయన్న విషయం అధికారులకు తెలిసినప్పటికీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. ఆచంట నియోజకవర్గంలో ఇద్దరు సర్పంచ్‌లు ఇసుక దందాతో కోట్లకు పడగలెత్తారు. అధికార పార్టీ అండదండలతో అవినీతికి పాల్పడ్డారు. నియోజకవర్గంలో ఇదే పెద్ద చర్చగా మారింది. జగనన్న కాలనీల పేరుతో బొండు ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగాయి. జగనన్న కాలనీలకు పగలు బొండు ఇసుకను తరలించారు. రాత్రి వేళ్లలో పక్కదారి పట్టించారు. ఐదేళ్లపాటు ఇదేదందా నడిచింది. ఇప్పటికీ అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

కుదేలైన నిర్మాణ రంగం

వైసీపీ హయాంలో ఇసుక ధరలతోపాటు, సిమెంట్, స్టీలు ధరలు పెరిగాయి. మరోవైపు అధికార ప్రజా ప్రతినిధుల అడ్డగోలు అవినీతికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నిర్మాణాలపై వసూళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల జిల్లాలో నిర్మాణరంగం కుదేలైంది. భవన నిర్మాణ వ్యయం అధికమైంది. మరోవైపు ఆశించిన స్థాయిలో నిర్మాణాలు చేపట్టడం లేదు. అభివృద్ధి పనులు మందగించాయి. ఉపాధి మార్గాలు మూసుకుపోయాయి.

తెలుగుదేశం ఉచిత హామీ

తెలుగుదేశం హయాంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారు. కేవలం తవ్వకం చార్జీలు మాత్రమే వసూలుచేశారు. ఆపైన రవాణా వ్యయం కలుపుకొన్ని మార్కెట్‌లో ఇసుక లభించేది. ఇసుక ధరలు దిగొచ్చాయి. అప్పట్లో లారీ ఇసుక కేవలం రూ.9 వేలకే లభ్యమైంది. నిర్మాణ రంగం జోరు మీద ఉండేది. దాని అనుబంధ రంగాలు వృద్ధిలో ఉండేవి. రియల్ ఎస్టేట్ మంచి జోష్ కనబరిచింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక విధానం అస్తవ్యస్తమైంది. నిర్మాణ రంగం పతనమైంది. అవినీతి రాజ్యమేలుతోంది. రియల్టర్లు ముఖం చాటేశారు. హైదరాబాద్‌కు తరలిపోయారు. ఇక్కడ ఉపాధి తగ్గింది. జిల్లాలో నిర్మాణాలు చేపట్టాలంటే అధికార పార్టీ నేతలకు కమీషన్‌లు ఇచ్చే దుస్థితి దాపురించింది. సొంత నిర్మాణాలను వాయిదా వేసుకున్నారు. మరోవైపు ఇసుక ధరలతోపాటు, ఇతర సామగ్రి ధరలు పెరిగిపోయాయి. ఫలితంగా తెలుగుదేశం మళ్లీ ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామంటూ హామీ ఇచ్చింది. కూటమి అధికారంలోకి రాగానే ఉచిత విధానం తీసుకువస్తామంటూ చంద్రబాబు భరోసా ఇస్తున్నారు. అదే జరిగితే ట్రాన్స్‌పోర్టు చార్జీలు చెల్లిస్తే చాలు.. ఉచితంగా ఇసుక దొరుకుతుంది. నిర్మాణ రంగం జోరందుకోనుంది. కార్మికులకు ఉపాధి మరింత మెరుగుపడుతుంది. అనుబంధ రంగాల వ్యాపారాలు పెరుగుతాయి. రవాణా రంగానికి మేలు జరుగుతుంది.

జనం పట్టిస్తే మాయం

- కరుగోరుమిల్లి ర్యాంప్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై గ్రామస్థుల దాడి
- ఆరు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్ అధికారులకు అప్పగింత.. సాయంత్రానికి ఏమయ్యాయో!

ఆచంట, ఏప్రిల్ 9 : ఆచంట మండలం కరుగోరుమిల్లి ఇసుక ర్యాంపులో అక్రమ ఇసుక తవ్వకాలపై గ్రామస్తులు దాడి చేశారు. అక్కడే వున్న ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబీని అధికారులకు పట్టించారు. కాని, సాయంత్రానికి అవి అక్కడి నుంచి మాయం కావడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఇసుక ర్యాంపు నిర్వహణకు పర్మిషన్ వచ్చిందంటూ ఇటీవల ఓ సంస్థ యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టింది. ఆ సంస్థ నిర్వాహకులు తీసుకువచ్చిన అనుమతి పత్రం నకిలీదని తేలడంతో అధికారులు ఆ ర్యాంపును మూయించేశారు. తాజాగా కొద్ది రోజులుగా మళ్లీ ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి. వాహనాలు బారులు తీరి ఉండడంతో గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి ర్యాంపులోకి వెళ్లి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న వీఆర్వో మంగళవారం ఉదయం అక్కడకు వెళ్లి ఆరు ఖాళీ ట్రాక్టర్లు, ఒక జేసీబీ ఉన్నట్లు గుర్తించారు. వాహనాల యజమానులు లేకపోవడంతో దీనిపై వివరాలు నమోదు చేసి స్థానిక తహసీల్దార్‌కు తెలియజేశారు. అయితే సాయంత్రానికి ర్యాంప్ వద్ద వున్న ఆరు ట్రాక్టర్‌లు, జేసీబీ మాయమైనట్లు సమాచారం. అధికారులు పట్టుకున్న కొంతసేపటికే వీటిని అక్కడి నుంచి తరలించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్‌ఐ ఎం.రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ర్యాంప్ వద్ద పట్టుకున్న వాహనాలకు సంబంధించి కస్టడీలోకి తీసుకోమని ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. తహసీల్దార్ ఐపీ శెట్టి మాత్రం ఈ ఘటనపై మైనింగ్ అధికారులకు తెలియజేసినట్లు చెబుతున్నారు. గ్రామంలో యధేచ్ఛగా ఇసుక దందాపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ భర్త అల్లం సూర్యప్రకాశరావు ఆరోపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తణుకులో ప్రజాగళం

- నేడు హాజరుకానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్
- రోడ్ షో, భారీ బహిరంగ సభ
- అనంతరం నిడదవోలు వరకు రోడ్ షో, సభ





తణుకులో హెలీప్యాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి

భీమవరం/తణుకు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాగళం బహిరంగ సభకు తణుకు ముస్తాబైంది. ఈ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ హాజరుకానున్నారు. వీరిద్దరూ వేర్వేరు హెలీకాప్టర్లలో బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు తణుకు పాలిటెక్నిక్ కళాశాలలో ల్యాండ్ కానున్నారు. ఈ మేరకు ఇక్కడ హెలీప్యాడ్‌లు ఏర్పాటు చేశారు. వీరిద్దరూ కలిసి ఇక్కడి నుంచి పట్టణంలోని నరేంద్ర సెంటర్ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. నాలుగు గంటలకు సభ మొదలై ఐదున్నర గంటలకు ముగుస్తుంది. అనంతరం రోడ్డు మార్గంలోనే నిడదవోలుకు చేరుకుని రాత్రి ఏడు గంటలకు జరిగే బహిరంగ సభలో మాట్లాడతారు. ఈ సభలో కూటమి నుంచి రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి కూడా పాల్గొంటారు. సభ పూర్తయిన తర్వాత చంద్రబాబు నిడదవోలు తిరుమల సాయి కల్యాణ మండపంలో బస చేస్తారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో బస చేస్తారు. గురువారం ఉదయం చంద్రబాబు ఉభయ గోదావరి జిల్లాల నేతలతో నిడదవోలులో సమీక్ష జరిపి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేస్తారు. తణుకులో జరిగే ప్రజాగళం సభకు జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యేలా కూటమి నేతలు ఏర్పాట్లుచేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లను తణుకు మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ పరిశీలించారు. పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

రూ.12.45 కోట్ల నగదు, బంగారం సీజ్

- ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 9 : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.12.45 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ మాట్లాడుతూ 'ఏలూరు జిల్లాలో 45 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 28 స్టాటిక్ సర్వే లెన్స్ టీమ్స్ రాష్ట్ర సరిహద్దుల వద్ద పది ఎస్ఎస్‌టీ బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశాం. వీరు జరిపిన దాడుల్లో రూ.151.61 లక్షల నగదు, రూ.10.17 కోట్ల బంగారం, వెండి వస్తువులు, రూ.71.53 లక్షల 27,800 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. సి-విజిల్ ద్వారా 287 ఫిర్యాదులు అందగా 186 పరిష్కరించాం. ఎన్నికలకు సంబంధం లేని 101 ఫిర్యాదులు తిరస్కరించాం' అని తెలిపారు.

టీడీపీలోకి గ్రామ వలంటీరు

పెదవేగి, ఏప్రిల్ 9 : దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన పజ్జూరి రాంబాబు వలంటీరుకు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో జరిగిన కార్యక్రమంలో రాంబాబుకు చింతమనేని ప్రభాకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు చూసి తట్టుకోలేకే ఆ పార్టీని వీడానని రాంబాబు తెలిపారు. టీడీపీతోనే సంక్షేమ పాలన సాగుతుందనే నమ్మకంతోనే టీడీపీలోకి వచ్చానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తానన్నారు.

ఉగాది వైభవం



ఉగాది సందర్భంగా భీమవరం మావుళ్లమ్మకు ప్రత్యేక అలంకరణ

అర్చకులు, పండితులకు కలెక్టర్ సత్కారం



భీమవరం టౌన్, ఏప్రిల్ 9 : శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళశారం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వేద ఇరగవరం శ్రీ పాలేశ్వరస్వామి ఆలయ వేద పండితులు గొల్లపల్లి వెంకటనాగశ్రీరామశర్మ అవధాని, ఆకివీడు శ్రీ మదన గోపాలస్వామి ఆలయ అర్చకులు సుదర్శనం రాధాకృష్ణమాచార్యులు, పాలకొల్లు మండలం అగర్రు శంభు లింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు మంచిలి విశ్వనాథశర్మలను ఉగాది పురస్కారాలతో కలెక్టర్ కలెక్టరు సుమిత్‌కుమార్ సత్కరించారు. వీరికి ప్రశంసాపత్రంతోపాటు ఒక్కొక్కరికి రూ.10,116 నగదు అందజేశారు. వీరి సేవలను గుర్తించి ఉగాది పురస్కారాలతో సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలకు అన్ని విధాలా మేలు జరగాలని కలెక్టరు ఆకాంక్షించారు.

కార్యకర్తలు ఆదేశిస్తే పార్టీని వీడతా

ఉండి సీటు మార్పుపై ఎమ్మెల్యే రామరాజు కంటతడి



పెదఅమిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరాజు, చిత్రంలో గన్ని

కాళ్ల, ఏప్రిల్ 9 : సిట్టింగ్ ఎమ్మెల్యేగా మొదటి లిస్టులోనే అభ్యర్థిగా ప్రకటించిన తనను మళ్లీ మార్చాలనుకోవడం దారుణమని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆవేదన వ్యక్తంచేశారు. పెద అమిరంలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ అధిష్ఠానం ఉండి సీటుకు అభ్యర్థిని మార్చే ఆలోచన వుందని తెలుసు కున్న కార్యకర్తలు సభలో నేలపై బైఠాయించి నినాదాలు చేశారు. సీటు మారిస్తే ఊరుకోబోమని పరిశీలకులుగా వచ్చిన ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, కొత్త నాగేంద్రకుమార్‌లకు తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అధిష్ఠానం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కొత్తగా వచ్చిన వేరే వ్యక్తికి సీటు కేటాయిస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యకర్తలు ఆదే శిస్తే పార్టీని వీడడానికి వెనుకాడనన్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండడమే నేను చేసిన తప్పా అంటూ కంటతడి పెట్టారు. పరిశీలకుడు గన్ని మాట్లాడుతూ కార్యకర్తల ఆవేదనను అధినాయకుడి దృష్టికి తీసుకుని వెళతానన్నారు. రాష్ట్రంలో జగన్ దుర్మార్గపాలనను అంతమొందించేందుకు కూటమి ఏర్పడిందని, ఇందులో భాగంగానే ఉంగుటూరులో తన సీటును కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అవసరమైతే త్యాగాల కు సిద్ధపడాలన్నారు.

గ్రామాల్లో నీటి కష్టాలు
సాగు, తాగు నీరు లేక శివారు ప్రాంతాల్లో జనం అవస్థలు -7లో



క్రికెట్ క్రీడలో పాల్గొన్న నిట్ విద్యార్థులు, ఆచార్యులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 9 : విద్యార్థులు చదువుతో పాటూ క్రీడల్లోనూ రాణించాలని ఏపీ నిట్ డీన్ (స్టూడెంట్స్ వెల్ఫేర్) డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సహకారంతో నిట్ ప్రాంగణంలో వారం రోజుల పాటు నిర్వహించే క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ స్నేహపూర్వక క్రికెట్ పోటీలు ఆచార్యులు, విద్యార్థుల మధ్య వారధిగా నిలుస్తాయన్నారు. విద్యార్థులతో పాటూ ఆచార్యులు, సిబ్బంది కూడా పాల్గొంటారన్నారు. మొత్తం 8 జట్లు తలపడతాయన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్ తీపర్తి,ఆచార్యులు డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ సుదర్శన్‌ధ్రువ, సాస్ అసిస్టెంట్‌లు డాక్టర్ వీ.శ్రీనివాస్, సాయిరాం, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఉద్యాన పంచాంగం ఆవిష్కరించిన జవహర్‌రెడ్డి



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రచురించిన క్రోధి నామ సంవత్సర ఉద్యాన పంచాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటల అభివృద్ధికి విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని అభినందించారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ టీ.జానకీరామ్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు కరుణశ్రీ పాల్గొన్నారు.



విజయరాయి సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

రూ.5,71,500 సీజ్

పెదవేగి, ఏప్రిల్ 9 : ఎన్నికల స్క్వాడ్ బృందాలు ఎక్కడికక్కడ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా పరిమితికి మించి తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు.ఫ్లయింగ్ స్క్వాడ్-3 అధికారి బి.నరసయ్య, పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌లు సిబ్బందితో కలిసి పెదవేగి మండలం విజయరాయి సమీపంలో బలివే అడ్డరోడ్డు దగ్గర మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తున్నారు. అనపర్తి నుంచి ధర్మాజీగూడెం మీదుగా ఏలూరువైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న చందురెడ్డి, శంకర్రావు దగ్గర ఎటువంటి ఆధారిత పత్రాలు లేని రూ.1,35,400 నగదును గుర్తించి సీజ్ చేసినట్టు పెదవేగి తహసీల్దారు సూర్యప్రభ తెలిపారు. అలాగే లింగపాలెం మండలానికి చెందిన పాస్టర్ ఏలియ్య కారులో రూ.1.50 లక్షలను గుర్తించి సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన సొమ్మును ఏలూరు జిల్లా ట్రెజరీలో జమచేశామని సరైన ఆధారాలు చూపిస్తే ఆ నగదును తిరిగి ఇచ్చేస్తామని ఆమె వివరించారు.

కొత్తూరు వద్ద ఇద్దరి నుంచి రూ.2.15 లక్షలు



కామవరపుకోట : కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టు వద్ద మంగళవారం అధి కారులు ఇద్దరు వ్యక్తుల నుంచి రెండు లక్షల 15 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్ పోస్టు ఇన్‌చార్జి కొయ్యగూర బాబూరావు తెలిపారు. రావికంపాడుకు చెందిన వ్యక్తి నుంచి 60 వేలు, పాతగండి గూడేనికి చెందిన మహిళ నుంచి లక్షా 55 వేలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పి.వీరాస్వామి, తడికల పూడి కానిస్టేబుళ్లు కె.రమేష్,కె.రామకృష్ణ ఎం. నాగార్జున, షేక్ నాగూర్ సాయి తదితరులు ఉన్నారు.

ఉంగుటూరులో రూ.71,500

ఉంగుటూరు :ఉంగుటూరులో ఫ్లయింగ్ స్క్వాడ్ మంగళవారం సాయంత్రం అమలాపురం నుంచి హైదరాబాదుకు వెళుతున్న వాహనాన్ని తనిఖీ చేయగా అనుమతిలేని నగదు రూ.71,500 స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి టోల్ గేట్ సమీపంలో వాహనాన్ని తనిఖీ చేయగా వారి నుంచి రూ.1,41,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్, చేబ్రోలు ఎస్సై మణి కుమార్‌లు తెలిపారు.

26.64 లక్షల విలువైన మద్యం పట్టివేత



మద్యం తరలిస్తూ అల్లిపెల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన వాహనం

చింతలపూడి, ఏప్రిల్ 9: చింతలపూడి మండల సరిహద్దు అల్లిపెల్లి చెక్ పోస్టు వద్ద 26 లక్షల 64 వేల 320 రూపాయల విలువైన అనుమతులు లేకుండా తీసుకు వెళుతున్న మద్యాన్ని ఎస్.ఎస్ టీమ్ మంగళవారం పట్టుకు న్నట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. 3,546 లీటర్లు, 16,284 బాటిల్స్‌లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఏలూరు ఎమ్మార్సీ గోడౌన్ నుంచి ఈ మద్యాన్ని తీసుకు వెళుతున్నట్లు డ్రైవర్ చెబుతున్నాడు. అయితే పత్రాలు లేకపోవడంతో మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఎస్ఈబీ అధికారులకు అప్పగించినట్టు తెలిపారు. ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్‌లో ఈ మద్యాన్ని నమోదు చేసినట్టు తెలిపారు.

8-04-2024 పొగాకు ధరలు (రూ.)

పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	225	234.42
జంగారెడ్డిగూడెం-1	242	235	240.10
జంగారెడ్డిగూడెం-2	242	235	239.68
కొయ్యలగూడెం	243	235	240.01
గోపాలపురం	242	235	239.52

కన్నీటి కష్టాలు



ఎల్ఎన్‌పురంలో రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం ఫిల్టర్ బెడ్‌లో పచ్చరంగులోకి మారిన తాగునీరు

ఎల్ఎన్ పురంలో కలుషిత నీరే దిక్కు

కాళ్ల, ఏప్రిల్ 9 : కాళ్ల మండలం ఎల్ఎన్ పురంలో రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తుండటం అధికారుల అలసత్వాన్ని తెలియజేస్తున్నది. కొద్ది రోజులుగా కుళాయిల్లో రంగుమారి, దుర్వాసనతో నీరు సరఫరా అవుతోంది. రంగు మారిన నీటినే సరఫరా చేయడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ నీటిని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. ప్రజారోగ్యంతో అధికారులు చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.దీనిపై పంచాయతీ కార్యదర్శి హసీనా మాట్లాడుతూ రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం వద్ద వాల్‌ఫిట్ రిపేరు రావడంతో ఇబ్బంది తలెత్తింది. దానిని బాగు చేసే పనిలో నిమగ్నమయ్యాం. ఫిల్టర్ బెడ్స్‌ని కూడా క్లీనింగ్ చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నెల రోజులుగా ఇదే పరిస్థితి



గ్రామంలో సుమారు నెల రోజులు పైబడి రంగు మారి దుర్వాసనతో కూడిన తాగునీరు కుళాయిల ద్వారా వస్తుంది. ఈ నీరు తాగటం వల్ల ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారు.

-వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్, ఎల్ఎన్‌పురం

ప్రజల ప్రాణాలతో చెలగాటం



రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం నిర్వహణ సరిగా లేకపోవడంతో పూర్తిగా కలుషితమైన జలాలు కుళాయిల ద్వారా వస్తుంది. ఈనీరు తాగి ప్రజలకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులు..? అధికారులు, పాలకవర్గం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

-బి.నరసింహస్వామి, మాజీ ఎంపీటీసీ, ఎల్ఎన్‌పురం

మంచినీటి చెరువులకు నీరివ్వండి

కాళ్ల, ఏప్రిల్ 9 : వెంకయ్య వయ్యేరు పంట కాలువలో గుర్రపుడెక్క, తూడు మేట వేయడంతో పాటు మట్టి పేరుకుపోయింది. దీంతో పది గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే అన్నయ్యకోడు ఛానల్ మురుగు కాలువగా తయారైంది. మంచినీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని నింపేందుకు 20 రోజులపాటు వంతుల వారీలో నీటిని అందించాలని కలవపూడి సర్పంచ్ గేదల జాన్ ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. కలవపూడిలో పూర్తిగా అడుగంటిన మంచినీటి చెరువు, అన్నయ్యకోడు, వెంకయ్య వయ్యేరు పంట కాలువలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలిసి తాగునీటి సమస్యను వివరించామన్నారు. గోదావరిలో నీరు లేదని సీలేరు జలాల నుంచి అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారన్నారు. వంతులవారీలో మరో 20 రోజులుపాటు నీటిని అందించాలని, చేపలు, రొయ్యలు, చెరువు రైతులకు నోటీసులు ఇచ్చి పంట కాలువపై అధికారుల పర్యవేక్షణ ఉంటేనే చెరువులకు నీరు నింపుకొనే అవకాశం ఉందన్నారు.



కలవపూడిలో అడుగంటిన చెరువు



చెరుకుమిల్లిలో మోటార్లు బిగించుకుంటున్న రైతులు

మోటార్ల సాయంతో నీరు

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 9 : దాళ్వా సాగుకు నీటి ఎద్దడితో రైతుల ఇబ్బం దులు పడుతున్నారు. కాలువలో నీటి మట్టం లేకపోవడంతో పాలు పోసుకునే సమయంలో నీటిని అందించేందుకు రైతులు మోటారులపై ఆధార పడు తున్నారు. ఆకివీడు మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో అద్దెకు మోటార్లు తీసుకుని వచ్చి నీటిని తోడుకుంటున్నట్లుగా రైతులు తెలిపారు. ఇప్పటికే మూడువంతుల వ్యవసాయభూముల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ఉన్న అరకొర వ్యవసాయం భూములు సాగు సమయంలో నీరందక రైతులు కష్టాలు పాల వుతున్నారు. నీటి పారుదల శాఖాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చెయ్యడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఉన్నతాధికారులు ఎన్నికల మీద దృష్టి పెట్టినందున కిందిస్థాయి సిబ్బంది విధి నిర్వహణపై శ్రద్ధ చూపించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని సాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని కోరుతున్నారు.

మూడురోజులకోసారి కుళాయి

శివారు గ్రామాల్లో దాహం దాహం..

కలిదిండి, ఏప్రిల్ 9 : జిల్లాకు శివారు గ్రామాలైన పెదలంక, మూల్లంక, భాస్కరరావుపేట గ్రామాల్లో తాగునీటి చెరువులు అడుగంటాయి. ప్రస్తుతం మూడు రోజులకొకసారి కుళాయిలను వదులుతున్నారు. ఫిల్టర్ చేయకుండా నేరుగా బురద నీటిని వదలటంతో అవి స్నానం చేస్తుంటే దురద వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా గ్రామాల్లో తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలంటే సీబీ కెనాల్‌కు కనీసం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా సోమవారం కేవలం 270 క్యూసెక్కులు మాత్రమే విడుదల కావటంతో అవి ఏ మూలకూ రాలేదు. వారం రోజులపాటు నిరంతరాయంగా తాగునీటి వంతు సరఫరా చేయాలని సర్పంచ్‌లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో సీబీ కెనాల్‌కు సమృద్ధిగా తాగునీరు విడుదల చేసే పరిస్థితి కన్పించటం లేదని ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరిలో పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు వద్దకు వంతులవారీ నీరు చేరకపోవటంతో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలు పేట వద్ద కాల్వలో మోటార్ పంపు సెట్‌లతో నీరు తోడినప్పటికీ పెదలంక తాగునీటి వద్దకు చేరలేదు.ఉమ్మడి కృష్ణా జిల్లాకు శివారు పశ్చిమ గోదావరి సరిహద్దున ఉప్పుటేరు పక్కన ఉన్న పెదలంకలో 8 ఎకరాల విస్తీర్ణం కలిగిన తాగునీటి చెరువు పూర్తిగా అడుగంటింది. ఈ సారి తాగునీటి వంతు చెరువు వద్దకు చేరితేనే చెరువును నింపటానికి అవకాశం ఉంటుందని,పెదలంక తాగునీటి చెరువును నింపటానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని సర్పంచ్ మోకా లక్ష్మీ, గ్రామస్థులు కోరుతున్నారు.



పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువు

నేత్రపర్వం..శ్రీవారికి ఉగాది ఉత్సవం

శేషవాహనంపై ఊరేగిన శేషాచల వాసుడు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9: ద్వారకాతిరుమలేశుని క్షేత్రంలో స్వామివారికి ఉగాది ఉత్సవం మంగళవారం రాత్రి రమణీయంగా జరిగింది. గరుడాళ్వార్ కూడలిలో ఉన్న ఉగాది మండపంలో ఆలయ అర్చకులు వేడుక నిర్వహించారు. ముందుగా సాయంత్రం ఆలయంలో ఉభయదేవేరులు, గోదాదేవితో కలసిన శ్రీవారి మూర్తులను వెండి శేషవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకారం చేశారు. మేళతాళాలు, సన్నాయివాయిద్యాలు వేదమంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారు కొలువుదీరిన వాహనం ఉగాది మండపం వద్దకు చేరింది. స్వామి, అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై శ్రీవారి మూర్తులను ఉంచి అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం చేశారు ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఈఓ త్రినాథరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిటకిటలాడిన ఆలయాలు

ద్వారకాతిరుమల /జంగారెడ్డిగూడెం/భీమవరం టౌన్ ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకాతిరరుమల చినవెంకన్న క్షేత్రానికి తెల్లవారు జాము నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయానికి వచ్చిన వారికి దేవస్థానం తీర్థ వినియోగ ప్రాంతంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేసింది. క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న శ్రీకుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి, ఈ సందర్భంగా అమ్మవారు లక్ష గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల 18న కుంకుమపూజ, చండీహోమం జరుగుతుందని అర్చకులు భైరవస్వామి తెలిపారు.



పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దర్శనార్థం భక్తులు బారులు తీరారు. మంగళవారం ఉగాది కలిసి రావడంతో వేలాది మంది స్వామివారి దర్శనానికి విచ్చేశారు.అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు పంచాంగ శ్రవణం కార్యక్రమమును ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ప్రారంభించారు. ప్రత్యేక పూలతో అలంకరించిన మండపంపై స్వామివారిని ఆసీనులను చేసి, అర్చక స్వాములు పంచాంగ శ్రవణం నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఉదయం ఆరాధన, తోమాలసేవ తదితర పూజాది కాల అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

భీమవరం మావుళ్లమ్మ ఆశీస్సులను అందుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల క్యూలైన్ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు చేరిపోయింది. ఎండ సైతం లెక్కచెయ్యకుండా అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో పండితులు పంచాంగ శ్రవణం చేశారు.



మావుళ్లమ్మ ఆలయం వద్ద క్యూలో భక్తులు



మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తజనం



ముని మనవడికి108 రకాల పదార్థాలతో స్వాగతం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 9: 108 పండి పదార్థాలు, మధుర ఫలాలు, తినుబండారాలతో ముని మనవడికి తాత స్వాగతం పలికిన సంఘటన మంగళవారం మర్లగూడెంలో జరిగింది. మర్లగూడెంకు చెందిన రిటైర్డు పోస్టుమాస్టర్ కనిగొల్ల దుర్గారావు, ధనలక్ష్మీల ముని మనవడు నాగ సూర్య ప్రవీణ్‌కు 108 రకాల రకాల తినుబండారాలతో స్వాగతం పలికారు. పెద్ద కుమార్తె కూతురు లిఖితప్రియ కుమారుడైన నాగ సూర్య ప్రవీణ్ మొదటిసారిగా మర్లగూడెం తన ఇంటికి రావడంతో ఏర్పాట్లు చేసినట్లు దుర్గారావు తెలిపారు. ఉగాది రోజున ఇలా చేయడం ఆనందంగా ఉందన్నారు.



ఆటో బోల్తా.. ఇరువురికి గాయాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో నూజివీడు నుంచి విస్సన్నపేట వైపు వస్తున్న ఆటో వెంకటాయపాలెం నుంచి వస్తున్న బైక్ ఢీకొన్నాయి. దీంతో ఆటో పల్టీకొట్టడంతో ఆటోలో ఉన్న డ్రైవర్ బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన కృష్ణతో పాటు ద్విచక్రవాహనం పై ఉన్న వెంకటాయపాలెంకు చెందిన పవన్ గాయాలపాలయ్యారు. ప్రమాదంలో గాయపడిన వారిని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తన వాహనంలో ఆసుపత్రికి పంపించారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం చాట్రాయి మండలం వెళుతున్న ఆయన ప్రమాద ఘటనను గమనించి తన వాహనంలో క్షతగాత్రులను ఆసుపత్రికి పంపి వైద్యసేవలు అందించాలని సూచించడంతో టీడీపీ కార్యకర్తలు వారిని ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

పండుగకు ఇంటికి వెళుతుండగా ప్రమాదం

భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9 : తాపీ పనులకు వెళ్ళి తిరిగి తమ గ్రామానికి వెళ్ళే నిమిత్తం రోడ్డుపై నిలబడి ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణా జిల్లా బాపుల పాడు మండలం బొమ్ములూరుకు చెందిన కుందేటి రవికుమార్ (45) తాపీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి ఏలూరులో తాపీ పనులు చేయడానికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా తన కుటుంబం వద్దకు వెళ్ళే నిమిత్తం సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఏలూరు సమీపంలో మెయిన్ బైపాస్ వంగూరు బ్రిడ్జి వద్దకు వెళ్ళి తన గ్రామం వైపు రోడ్డుపై నిలబడి ఉన్నాడు. అతనిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోయింది. దీంతో అక్కడికకడే మృతి చెందాడు. హైవే పోలీసులకు సమాచారం అందడంతో వారు వెంటనే ఏలూరు త్రిటౌన్ పోలీసులకు తెలి పారు. త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుళ్ళు ఏసేబు, విజయరాజులు కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 9: మండలంలోని ముద్దప్పగూడెంలో సారా తయారు చేస్తున్న కేంద్రాలపై మంగళవారం జిల్లా, డివిజన్ అధికారుల ఆదేశాల జీలుగుమిల్లి సీఐ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ఎస్ఐ కె.వెంకన్న సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో 60 లీటర్లు సారాను స్వాధీనం చేసుకుని 1200 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే సామాగ్రి స్వాధీనం చేసకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

ఆకివీడు, ఏప్రిల్ 9: అమ్మమ్మ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తానని చెప్పి విద్యార్థినిని బైక్‌పై ఎక్కించుకొని దారి మళ్లించడంతో భయంతో అతడి నుంచి తప్పించుకుని పోలీసులకు చెప్పడంతో ఆకివీడు ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన పెరుమాళ్ళపల్లి పవిత్ర బీకాం ఫైనలియర్ చదువుతోంది. ఉగాది సందర్భంగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆకివీడు మండలం అప్పారావుపేటలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు సోమవారం రాత్రి ఆకివీడు గుమ్ములూరు సెంటర్‌లో ఆటో కోసం ఎదురు చూస్తోంది. అప్పారావుపేటకు చెందిన రొయ్య వేణుగోపాల్ మీ అమ్మమ్మ ఇంటి దగ్గర దిగిపెడతానని చెప్పి మోటారు సైకిల్ ఎక్కించుకున్నాడు. అసభ్యకరంగా మాట్లాడుతూ దారి మళ్లించడంతో మోటారు సైకిల్‌పై నుంచి దూకి తప్పించుకుని బంధువులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి తీసుకెళ్లారు. మంగళవారం పవిత్ర ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ఆకివీడు/ కాళ్ళ, ఏప్రిల్ 9:సిద్ధాపురం, కురుపాకలో కోడి పందాలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేసి పది మందిని అదుపులోకి తీసుకొని రూ.8,300 ,మూడు కో డిపుంజులు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. సిద్ధాపురంలో ఐదుగురు వ్యక్తులు నుంచి రూ.4,500, కోడిపుంజు, కోడి కత్తి, కురుపాకలో ఐదుగురు వ్యక్తులు నుంచి రూ.3,800 , రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు. కాళ్ళ మండలం కోపల్లెలో ఉగాది పండుగ పురస్కరించుకుని కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.78,900 నగదు, 8 కోడిపుంజులు, 10 కోడికత్తులు స్వాధీనపరుచుకున్నట్టు కాళ్ళ ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత



కుక్కునూరు, ఏప్రిల్ 9 : గోదావరి ఆవలిలో ఉన్న తూర్పు గోదావరి జిల్లాలోని పలు గ్రామాల నుంచి గోదారి దాటి కుక్కునూరు మండలం వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకు న్నారు. వేసవి కాలం కావడంతో గోదావరి నీటి మట్టం తగ్గిపోయింది. ఈ క్రమంలో గోదావరిని దాటి మంగళవారం సీతారామపురం గ్రామానికి దాదాపు 70కు పైగా పశు వులను తోలుకొచ్చారు. ఇది తెలిసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పశువులను వెళ్లనివ్వకుండా అడ్డుకు న్నారు. ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారనే సమాచారాన్ని పోలీసులు సేకరించి విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా గత కొన్నినెలలుగా కుక్కునూరు మండలం వైపు నుంచి అక్రమంగా పశువుల రవాణా జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి.



వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

కిరాయికి ఆటో మాట్లాడుకుంటే దారిలో దాడిచేసి దోచేశారు

భీమవరం క్రైం, ఏప్రిల్ 9 : కిరాయికి ఆటో మాట్లాడుకుంటే ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి దాడి చేసి సొత్తు అపహరించిన సంఘటన భీమవరం పట్టణంలో చోటు చేసుకుంది. భీమవరం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి వివరాలు వెల్లడించారు. భీమవరం గ్రామీణ మండలం తోకతిప్ప గ్రామానికి చెందిన పొన్నాల వీర్రాజు మూడేళ్లక్రితం ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్ళారు. ఈనెల 2న హైద్రాబాద్ చేరుకుని భీమవరం చేరేసరికి రాత్రి 11 గంటలు అయింది. అంబేడ్కర్ కూడలిలో ఆటో కోసం చూస్తుండగా యలమంచిలి మండలం కాజ గ్రామానికి చెందిన చింతాడ జయరాజు, భీమవరంలోని మెంటేవారితోటకు చెందిన జల్లి సురేంద్ర వచ్చి రూ.500లకు తోకతిప్ప తీసుకు వెళ్లేందుకు కిరాయి మాట్లాడుకున్నారు. వీర్రాజును ఆటోలో ఎక్కించుకున్నారు. పెట్రోలు కొట్టించుకున్న తరువాత టిఫిన్ తిని వెళదామన్నారు. బైపాస్ రోడ్డులోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి బీరు సీసాతో బాధితుడి తలపై కొట్టి గాయపరిచారు. అతని దగ్గర ఉన్న సంచి తీసుకుని ఆటోలోనే ఇద్దరూ పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ అడబాల శ్రీను దర్యాప్తు చేశారు. నిందుతులను పట్టుకున్నారు. రూ.1200 నగదు, పాస్‌పోర్టు, సెల్‌ఫోన్, వాచీలు, రెండు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు వెంటనే చేధించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ళు లెనిన్ ప్రసాద్, శ్రీనివాస్, కె.నాగేంద్ర, రామకృష్ణ, జోసెఫ్, బాస్కరరావును డీఎస్పీ అభినందించారు.

మాధవరంలో జాతర

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9: తాడేపల్లిగూడెం మండలం మిలిటరీ మాధవరం గ్రామదేవతల జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాధవరం నుంచే కాక మండలం నలుమూలల నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. రాత్రి భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న పారిశ్రామికవేత్త వెంకట్రావు

ఆకివీడు, ఏప్రిల్ 9: మానవసేవే..మాధవసేవని పారిశ్రామికవేత్త చుండూరి వెంకట్రావు అన్నారు. జనని సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు చీరలు, లుంగీలు, కండువాలతో పాటు భోజనం అందచేసి మాట్లాడారు. మాదివాడలో 2013 నుంచి ప్రతీ ఏటా ఉగాది రోజున వృద్ధులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మోటుపల్లి నాగభూషణం, మో టుపల్లి శ్రీను, అడపా అబ్బులు, పోశంశెట్టి హరి, మోటుపల్లి రాజా, వక్కపట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయానికి వెండి వస్తువుల అందజేత



ఆకివీడు, ఏప్రిల్ 9: ఆకివీడు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో మాణిక్యాంబకు అర్చకులు మెవ్వా వెంకటరత్నం వెండి కిరీటం, ఆకెళ్ళ శుభద్రదేవి వెండి వామ-దక్షిణ హస్తాలు మంగళవారం అందించారు. ఉగాది రోజున మాణి క్యాంబకు అందచేయడం ఎంతో సంతోషంగా ఉందని వెంకటరత్నం తెలిపారు.

వీరపేరంటాలమ్మ జాతర

ఉండి, ఏప్రిల్ 9: శ్రీవీరపేరంటాలమ్మ జాతర పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కుబడలను చెల్లించుకున్నారు. సాయంత్రం మేళతాళాలు, గరగల నృత్యం, తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషధారణలతో అమ్మవారి జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే రామరాజు, వైసీపీ ఇన్‌చార్జు పీవీఎల్ నరసింహరాజు, గోకరాజు రామరాజు, జనసేన జుత్తుగ నాగరాజు తదితరులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

శివ రామరాజు దంపతుల పూజలు


వెలివర్రులో అమ్మవారిని దర్శించుకుంటున్న శివ దంపతులు

ఉండి, ఏప్రిల్ 9: నియోజకవర్గ ప్రజలను వీరపేరంటాలమ్మ అమ్మవారు ఆశీర్వదించాలని స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివ రామరాజు ప్రార్థించారు. అమ్మవారిని వేటుకూరి శివరామరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో రుద్రరాజు ఫణికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: ఉండి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని మరోసారి కల్పించాలని స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. కోరుకొల్లు, మైప, మోగల్లు గ్రామాలలో శివరామరాజు ప్రచారం నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని మూడు గ్రామాల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపి గ్రామాలలోని ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

ఆకివీడు, ఏప్రిల్ 9: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక పొట్టిశ్రీరాముల విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని సంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి ప్రారంభించారు.

పెనుగొండ: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలి వేంద్రాన్ని వాసవి క్లబ్స్ మిత్ర అధ్యక్షుడు గ్రంధి అజయ్ చంద్రయ్య ప్రారంభించారు.గ్రంధి లక్ష్మీనారాయణ, అత్యం సత్యనారాయణమూర్తి, నార్కిడిమిల్లి సూర్య ప్రభాకరరావు, సింగంశెట్టి రమేశ్, చింతలపూడి గోవిందరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 9: వైసీపీ జగన్ రాష్ట్రానికి చేసిందేమి లేదని, కనీసం రాజధాని కూడా నిర్మించలేదని కాంగ్రెసు పార్టీ భీమవరం ఎమ్మెల్యే అభ్యర్థి అంకెం సీతారామ్ అన్నారు. భీమవరం నియోజకవర్గం రాయలంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెసు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్య రాజు, సోడదాసి గంగయ్య, సోము నాగ కేశవ్ బాబు, చింతగుంట మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: కాంగ్రెస్ అభ్యర్థి కానూరి బుజ్జి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని పీతానిమెరక గ్రామంలో ఓటర్లను కలిసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. ఆయన వెంట నాయకులు పి.శ్రీనివాస్, కృష్ణారావు, సాల్మన్‌రాజు, చిన్న, అమరేశ్వరరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీపీ సుంకరకు అభినందన

అత్తిలి, ఏప్రిల్ 9 : అత్తిలి ఇన్‌ఛార్జి ఎంపీపీగా నియమితులైన ఈడూరు ఎంపీటీసీ సుంకర నాగేశ్వరరావును మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అభినందించారు. అత్తిలి ఎంపీపీగా ఉన్న మక్కా సూర్యారావు తన పదవికి రాజీనామా చేయడంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న నాగేశ్వరరావును ఇన్‌ఛార్జి ఎంపీపీగా నియమిస్తూ జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. మరో మండల ఉపాధ్యక్షురాలు దారం శిరీష ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.

చండ్ర రాజేశ్వరరావుకు నివాళులు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 9: అసమానతలు, దోపిడిలేని సమాజ స్థాపన కోసం తన జీవితాన్ని ధారపోసిన వ్యక్తి చండ్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. చండ్ర రాజేశ్వరరావు 30వ వర్ధంతిని బుధవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ శ్రేణులు నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఇరవై సంవత్సరాలు పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాదు, మల్లుల శ్రీనివాస్, వైవి ఆనంద్ పాల్గొన్నారు.

చిత్రకళ వ్యాప్తికి అంకాల అకాడమి కృషి భేష్

భీమవరం టౌన్, ఏప్రిల్ 9 : ఆధునిక సాంకేతికత, డిజిటల్ మార్పు ప్రభావంతో సాంప్రదాయ కళలు మరుగునపడే పరిస్థితి ఏర్పడిందని, ఈ నేపథ్యం లో చిత్రకళ వ్యాప్తికి అంకాల ఆర్ట్ అకాడమి చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఉప వాణిజ్య పన్నుల అధికారిణి ఎం.శేషకుమారి అన్నారు. అకాడమి ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని ఆమె అన్నారు. మంగళవారం చిత్రకారులు కట్టిబోయిన శ్రీనివాస్, పరిమి రామకృష్ణ, గ్రంధి నరసింహమూర్తిలకు జరిగిన సత్కార సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ ముగ్గురు చిత్రకారులు విద్యార్థులకు చిత్రకళలో మెళకువలు నేర్పుతూ తీర్చిదిద్దుతున్నారని అకాడమి అధ్యక్షుడు గ్రంధి వెంక ట్రావు అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కాగిత వెంకటరమణ, కోశాధికారి గోపా సత్యనారాయణ, సహాయ కార్యదర్శి భాను, రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9: మోదుగగుంటలో గ్రామ దేవత మార్లమ్మ జాతర సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ నిర్వాహకుడు కేసుబోయిన అబ్బు, సర్పంచ్ కట్టా జానకి సత్యవతి, మాజీ సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ కామన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల తనిఖీ

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 9 : అజ్జమూరు, దుంపగడప గ్రామాల లోని ప్రభుత్వ మద్యం షాపులను తహసీల్దారు వెంకటేశ్వరి, డీటీ ఫారూక్, భీమవరం ఎక్సైజు డిపో ఎస్ఐ సునీల్‌కుమార్ తనిఖీ చేశారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశాల మేరకు ఈ రెండు షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం విక్రయాలపై నిఘావేసేందుకు ఈ తనిఖీ చేసినట్లుగా తెలియవచ్చింది.

చీరలు, హ్యాండ్ బ్యాగ్‌ల పంపిణీ

కాళ్ళ, ఏప్రిల్ 9 : క్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినంను పురస్కరించుకొని ఎస్టీయూ (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ ఆధ్వర్యంలో మోడీ గ్రామలో మహిళలకు చీరలు, హ్యాండ్‌బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జనార్దనరావు, సీహెచ్ మోహనబాబు, సుబ్బరాజు, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


భీమవరంలో గజమాల అలంకారంలో ఆదిలక్ష్మి.. పంచారామ క్షేత్రం సోమేశ్వర స్వామికి అలంకరణ.. అన్నపూర్ణాదేవికి దీపాలంకరణ.. శంకరమఠంలో శారదాంబకు ప్రత్యేక అలంకారం.. భీమలాపురం గోసలమ్మ.. అచ్చుగట్లపాలెంలో ముఖదారమ్మ.. పాలకొల్లులో క్షీరా రామలింగేశ్వర స్వామికి అలంకరణ

శ్రీ క్రోధి నామ ఉగాది వేడుక

కిటకిటలాడిన ఆలయాలు.. ప్రత్యేక అలంకారాలు


ఆకివీడులో పంచాంగ శ్రవణం

భీమవరం టౌన్,ఏప్రిల్ 9 : క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున అభ్యంగన్న స్నాన్నంచేసి నూతన వస్త్రాలుధరించి ఉగాది పచ్చడిని రుచి చూసి అనంతరం దైవ దర్శనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. పంచారామ క్షేత్రమైనగును పూడిలోని సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. అన్నపూర్ణాదేవికి దీపాల అలంకారం చేశారు. రెస్టుహౌస్ రోడ్డులోని శంకర మఠంలో శరదాంబకు విశేష పూజలు చేసి అలంకారం చేశారు. ఆలయ ధర్మకర్త వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు భ్రమరాంబ దంపతులు పూజలు చేశారు. గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల జాతరను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేసి గజమాలతో అలంకారం చేశారు.

మాముడూరులో రథోత్సవం

పెనుమంట్ర, ఏప్రిల్ 9 : మాముడూరులోని శ్రీ పార్వతీ సమేత జగదీశ్వర స్వామి ఆలయంలో ఉగాది పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లు మాముడూరు పురవీధుల్లో రథంపై మేళ తాళాలు మంగళవా యిద్యాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులు నిర్వహించారు.

వేడుకగా గోగులమ్మ జాతర

ఆచంట, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా భీమలాపురంలో గ్రామ దేవత గోగులమ్మ జాతర సోమవారం రాత్రి వేడుకగా జరిగింది. బుధవారం అమ్మవారి గరగలతో ఊరేగింపు నిర్వహించి తరువాత అమ్మవార్లకు గ్రామస్థులు పొన్నులు నిర్వహించి మొక్కులు చెల్లిస్తారు. కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ముఖదారమ్మ జాతర

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 9 : స్థానిక అచ్చుగట్లపాలెంలోని శ్రీ ముఖదారమ్మ జాతర మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ఈ జాతర ఉత్సవాలు వారం రోజుల పాటు జరుగుతాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. బాణసంచా కాల్పులు, గరగల నృత్యాలు, మేళతాళాలతో అమ్మవారి జాతర నిర్వహించారు. అమ్మవారిని టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషబాబు, నాయకులు చినమిల్లి గణపతిరావు, కుంపట్ల రాజా, గోవింద్, సత్తిబాబు, రజనీ దర్శించుకున్నారు.

నరసాపురం టౌన్: పట్టణ, మండలంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని అమ్మవారి ఆలయాల్లో పండుగ శోభ కనిపించింది. తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనాల కోసం క్యూ కట్టారు. పట్టణంలోని కనకదుర్గా, గంటాలమ్మ, పుంతల మునలమ్మ, కొండాలమ్మ, దుర్గాభవాని, మండలంలోని గంగాలమ్మ ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. నిప్పుల గుండాలు తొక్కి మొక్కులు తీర్చుకున్నారు.



పడమరవిప్పర్రు ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి.. పెంటపాడులో పుంతల మునలమ్మకు ప్రత్యేక అలంకరణ

పెంటపాడు: మండలంలో ఉగాది వేడుకలు ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పడమరవిప్పర్రులో జనసేన నాయకుడు గంటా నాగసుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. గ్రామంలోని మహాలక్ష్మి-మహంకాళమ్మ అమ్మవార్లను, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. పసల అచ్యుతం, పసల మహేష్, బాబి తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు పుంతల మునలమ్మ ఆలయంలో పూజలు ఘనంగా జరిగాయి. సాయంత్రం అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. కె.పెంటపాడు భైరాగిమఠం గోపాలస్వామి అంజనేయస్వామి ఆలయంలో ఆలయ పిట్‌పర్సన్ రవిశంకర్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది.

పెనుగొండ: ఉగాది సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆలయాలను దర్శించుకుని నూతన సంవత్సరంలో తమ తమ రాశి ఫలాలు ఏ విధంగా ఉంటాయో అడిగి తెలుసుకున్నారు.

మొగల్తూరు: ఉగాదిని పురస్కరించుకుని బండి ముత్యాలమ్మ అమ్మవారికి చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద వేసవి కారణంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మన్ మాణిక్యాలరావు, ఈవో డి.రామకృష్ణంరాజులు ప్రారంభించారు. పాలకవర్గ సభ్యులు, గ్రామ సర్పంచ్ కొవనాతి పల్లయ్య మాజీ చైర్మన్‌లు, భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గణపవరం: హిందూ సంస్కృతీ సంప్రదాయాలను తెలియ జెప్పేందుకు ఉగాది వేడుకలు ఎంతో ఉపయోగపడతాయని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు అన్నారు. మంగళవారం గణప వరంలోని సేవా సమితి కార్యాలయ ఆవరణలో ఉగాది వేడుకలు నిర్వహిం చారు. సంప్రదాయాలు కాపాడుకోవాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం వినిపించారు.రిటైర్డ్ లైబ్రేరియన్ చింతలపాటి సూర్యరాజు, రిటైర్డ్ పీడీ గొట్టుముక్కల గోపాల కృష్ణంరాజు, నంద్యాల సుబ్బరాజు, దాట్ల సుబ్బరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళ: కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజనసంద్రంగా మారింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు రాకతో ఆలయాలన్నీ రద్దీగా మారాయి. మండలంలోని కాళ్ళకూరు ఆలయంతో పాటు సీసలి శ్రీషర్డిసాయిబాబా ఆలయం, కోమటిగుంట దుర్గాదేవి ఆలయం, పెదఅమిరంలోని జైన మందిరాలు భక్తులతో నిండిపోయాయి. కాళ్ళకూరు వెంకటేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దైవారాధనతో మంచి ఫలితాలు

ఆకివీడు, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. రాష్ట్రంలో ఈ ఏడాది వైషమ్యాలు, విరోధాలకు ఆలవాలంగా ఉంటుందని, చాలా గడ్డుకాలం నడుస్తుందని పంచాంగకర్త దోనేపూడి శ్రీకృష్ణపరమాత్మ అన్నారు. మంగళవార పెద్దింట్లమ్మ, పార్వతీ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానాలతో పాటు ఆర్యవైశ్య కళ్యాణమందిరంలో ఆయన పంచాంగ శ్రవణం చేశారు. పాప ఫలాలు ఎక్కువగా ఉంటుండడంతో కుటుంబాల్లో కలతలు, నాయకుల మధ్య గొడవలుంటాయన్నారు. అక్టోబరు నుంచి అనేక ప్రభావితమైన రోగాలు ప్రబలుతాయన్నారు. ఓర్పుతో దైవారాధన చేయడం వలన మంచి ఫలితాలు పొందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. చండీ హోమాలు, లక్ష్మీ గణపతి హోమాలు, లక్ష్మీ నారసింహ హోమాలు చేయడం వలన లోకం ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో దేవస్థానాల చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, డైరెక్టర్ కుంకట్ల చంద్రావతి, మెప్మా చైర్మన్ మోరా జ్యోతిరెడ్డి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, సాంఘిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ డీవీ రమణమూర్తి, అ ర్చకులు వెంకట రత్నం, పవన్ పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: సమాజంలో అన్ని వర్గాల వారికి తెలుగు నూతన సంవత్సరం క్రోధి మేలు చేకూరుస్తుందని అభిషేక పండితుడు భమిడి పాటి వెంకన్న అన్నారు. శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆయన పంచాంగ శ్రవణం గావించారు. ఈసందర్భంగా 500 మందికి పంచాంగాలను పంపిణీ చేశారు.

కవులకు సత్కారం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 9: స్థానిక సాహితీ సంస్థ రసధుని ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం సంస్థ అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు అధ్యక్షతన సాహితీ కిర్మీరం కార్యక్రమం జరిగింది. ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఉగాది కవితలు, పద్యాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో కవులు మంకు శ్రీను, మామిడిశెట్టి శ్రీనివాసరావు, భాగవతల లక్ష్మీ నరసింహం, గాదరాడ రవి చంద్ర, ఏడిద రవీంద్ర, చేగొండి రంగారావు, కోలాటి చిన పెద్దిరాజు, పొశింశెట్టి సత్యశ్రీ, పీఎస్‌వీవీ శ్రీదేవి, కేశిరాజు కృష్ణలను సంస్థ కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా తటవర్తి కృష్ణమూర్తి, మామిడి బాబు, ప్రవీణ్ భాను, తదితరులు పాల్గొన్నారు. పండితులు గొర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు.


మెంటేవారితోటలో బాలత్రిపుర సుందరిదేవికి అలంకరణ

66 మందికి పురస్కారాలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 9 : భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా శ్రీక్రోధ నామ సంవత్సర ఉగాది వేడుకలను భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పూర్ణకలశంతో మావుళ్ళమ్మ దేవస్థానం నుంచి భీమేశ్వర స్వామిదేవ స్థానం వరకు శోభయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన పురస్కారాల సభలో జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి పి.సుజాత రాణి, జిల్లా ఖజానా అధికారి జి.గణేష్, రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ కృష్ణ మోహన్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వడుపు గోపి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కనుమూరి సత్యనారాయణ రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవి రమణ ప్రసంగించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 39 ఏళ్లగా వేడుకలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగులు, సంఘ సేవకులు, మహిళలు, విద్యావేత్తలు, కార్మికులు 66 మందికి ఉగాది పురస్కారాలను అందించామని, 54మంది విద్యార్థులకు రెడ్ క్రాస్ సంస్థ సౌజన్యంతో ప్రశంసా పత్రాలు అందించామని తెలిపారు.

అమ్మవారికి అభిషేకాలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా మెంటేవారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. ముందుగా కళశాలతో ఆలయం వద్ద నుంచి మేళతాళాలతో మెంటేవారితోటలో గ్రామోత్సవం నిర్వహించారు. గొట్టుముక్కల వెంకట లక్ష్మి నాయుడు నాగేంద్ర దంపతులు, కంచిరాజు వెంకటరావు లచే ఆలయ అర్చకులు కొమ్ముశ్రీనివాస్ 108 కళాశాలలోని జలంతో అభిషేకాలు నిర్వహించారు.


నరసాపురంలో టీ అందిస్తున్న జనసేన అభ్యర్థి నాయకర్.. శంకర్‌భవానికి పార్టీ కండువా కప్పుతున్న వలవల బాబ్జి.. గణపవరంలో కూటమిలోకి ఆహ్వానిస్తున్న గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు

వైసీపీ హామీలు నమ్మవద్దు: నాయకర్

నరసాపురం, ఏప్రిల్ 9: ఈ సారి ఎన్నికల్లో కూడా ప్రజల్ని మోసం చేసేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నదని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం పట్టణంలో టీ స్టాల్‌లో జనసేన గుర్తు గ్లాస్‌లో ఓటర్లకు టీ అందించారు. తనను గెలిపిస్తే చేసే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ హామీలను నమ్మి మోసపోవొద్దని హితవు పలికారు. అనంతరం మండలంలోని రుస్తుంబాదా ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, రవీంద్ర, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరావు, పోలిశెట్టి సాంబ, జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, నాగబాబు, పెద్దిరాజు, తుమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జనసేన గూటికి లక్ష్మణేశ్వరం సర్పంచ్

లక్ష్మణేశ్వరం పంచాయతీ సర్పంచ్ తిరుమాని వెంకట్రాజుతో పాటు మరికొంత మంది వైసీపీకి గుడ్‌బై చెప్పి జనసేనలో చేరారు. వీరందరికీ అభ్యర్థి నాయకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

'వచ్చేది టీడీపీ ప్రభంజనం'

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 9: 1983లో తెలుగుదేశం ప్రభంజనం ఏవిధంగా ఉండేదో... తిరిగి నేడు అదే ప్రభంజనం పునరావృతం అవుతుందని పాలకొల్లు, తణుకు అసెంబ్లీల పార్టీ పరిశీలకుడు బోణం నాగేశ్వరరావు అన్నారు. ఈమేరకు ఆయన మంగళవారం స్థానిక టీడీపీ నేత బోణం దొరయ్య నివాసంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఆనాడు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు సభలకు వచ్చిన ప్రజా సమూహం.. నేడు పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సభలకు కూడా వస్తున్నారని తెలిపారు. నేడు జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాలనూ భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగల సత్తా కలిగిన ప్రజా నాయకుడు చంద్రబాబు అని తెలిపారు.

టీడీపీలో చేరిక

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 9: వైసీపీ విధానాలతో ప్రజలంతా విసిగి పోయారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో పట్నాల శంకర్‌భవానితో పాటు సుమారు 50 కుటుంబాలకు చెందిన పలువురు వలవల బాబ్జి సమక్షంలో టీడీపీలో చేరగా వారికి బాబ్జి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్నాల రాంపండు, పసలపూడి రాంబాబు, కళ్యాణం రామచంద్రరావు, చొక్కా కన్నంనాయుడు, ముప్పిడి రమేష్, పొట్నూరి చంద్రశేఖర్, షేక్ హాజీ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి మద్దతుగా 300మంది చేరిక

గణపవరం, ఏప్రిల్ 9: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చి అభివృద్ధి పథంలో నడిపించే సత్తా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఉందని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు నియోజకవర్గ జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరంలో మంగళవారం సప్పా రాంబాబు ఆధ్వర్యంలో 300 మంది కూటమి అభ్యర్థి ధర్మరాజుకు మద్దతుగా కూటమిలో చేరారు. అంతకు ముందు జల్లికాకినాడ గ్రామంలో టీడీపీ అధ్యక్షుడు దండు బాబ్జీ రాజు ఆధ్వర్యంలో 30 మంది జనసేన పార్టీలో చేరారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, కూసంపూడి సురేంద్ర కుమార్‌రాజు, కాపారం చిన్న, యాళ్ళ సుబ్బారావు, అద్దేపల్లి వాసురాజు, దండు శ్రీహరిరాజు, పల్లి వెంకటేశ్వరరావు, దాసరి అప్పన్న, కనకరాజు సూరి, కూనిరెడ్డి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమితో అన్నివర్గాలకు మేలు: సూర్యకుమారి

పోడూరు, ఏప్రిల్ 9: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగు తుందని ఎమ్మెల్యే రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నా రు. మట్టపర్రు గ్రామంలో మంగళవా రం ఆమె పార్టీల శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే రామా నాయుడు మట్టపర్రు గ్రామంలో సిమె ంట్ రోడ్లు నిర్మించి గ్రామాన్ని సుందర ంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారా యణరాజు, ఉపాధ్యక్షుడు మైగాపుల శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కేతా వెంకట హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ యెల్లమెల్లి వెంకట్రావు, మాజీ సర్పంచ్ గోగులమండ రాంజీ అంబేడ్కర్, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడేనికి చెందిన పలువురు వైసీపీ నుంచి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో మంగళవారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో కనీస వసతుల కల్పనకు జగన్ నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. ప్రజలంతా కూటమి రావాలని కోరుకుంటున్నారన్నారు. గ్రామంలో వైసీపీ నుంచి జిజ్జవరపు సుబ్రహ్మణ్యం బ్రదర్స్, నాదెండ్ల శ్రీను, బండారి చెన్నయ్య, మానుకొండ శ్రీను ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరారు.

మసీద్‌లో ఎమ్మెల్యే నిమ్మల ప్రార్థనలు


పాలకొల్లు మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న టీడీపీ అభ్యర్థి రామానాయుడు

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 9: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం పాలకొల్లు మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఇతరుల పట్ల ప్రేమ, కరుణతో మెలగాలన్నారు. ముస్లింలతో కలిసి ఆయన ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ జానీ, షేక్ షిలార్, అబ్దుల్ రఫీ, మహమ్మద్ మస్తాన్, నజీర్ జుబేద్ యాకత్ ఆలీ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.